సాక్షి
మంచిర్యాల
సోమవారం ı 25 ı సెప్టెంబర్ ı 2023



మధుర సంస్కృతి.. విభిన్నం

నాగరిక సమాజానికి కాస్త దగ్గరగా ఉన్న సంచార సమూహమే మధుర తెగ. ఇందులో 11గోత్రాల వారున్నారు. వీరిలో ఉమ్మడి కుటుంబాలే అధికం. 8లో▸

బెర్లిన్ మారథాన్‌లో ఎస్పీ



బెర్లిన్‌లో జరిగిన మారథాన్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్ సత్తా చాటారు. 42.19 కిలోమీటర్ల దూరాన్ని 5.30 గంటల వ్యవధిలో పూర్తి చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

సీఎంఆర్.. పెండింగ్!

- అప్పగింతలో తీవ్ర జాప్యం
- గోదాముల్లోనే మగ్గుతున్న ధాన్యం..
- ఇప్పటికీ నాలుగు సీజన్ల బియ్యం బాకీ..
- మరోవైపు వానాకాలం ధాన్యం సేకరణకు అధికారుల ప్రణాళిక



మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎంఆర్ అప్పగింతలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు గడువు పొడిగించినా.. సమావేశాలు నిర్వహించినా తాము చేసేది చేస్తూనే ఉన్నారు. తాము ఇచ్చినప్పుడే తీసుకోవాలి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ గోదాంలలో వేల క్వింటాళ్ల ధాన్యం మగ్గిపోతుంది. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం, గోదాంలో నిల్వ చేసిన ధాన్యం మిల్లులకు కేటాయించినా తరలింపు ముందుకు సాగడం లేదు.

నాలుగు సీజన్ల ధాన్యం పెండింగ్..

2021–22 వానాకాలం, యాసంగి సీజన్, గడిచిన 2022–23 వానాకాలం, యాసంగి సీజన్ సంబంధించి 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. సీఎంఆర్‌పై ఇప్పటికే ప్రభుత్వం మిల్లర్లకు పలుమార్లు గడువు విధించడంతోపాటు, డిఫాల్టర్ కింద చేర్చడంతో రూ.51 కోట్ల వరకు జరిమానా కూడా విధించింది. అయితే జరిమానాకు బదులుగా బియ్యం ఇస్తామని మిల్లర్లు ప్రభుత్వంతో బేరసారాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. పరిస్థితి చూస్తే గడువులోగా సీఎంఆర్ పూర్తిచేసే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు అధికారులు 2023–24 వానాకాలం ధాన్యం సేకరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

గడిచిన రెండేళ్లుగా జిల్లాలోని మిల్లులకు తరలించిన ధాన్యం(మెట్రిక్ టన్నుల్లో..)

2021-22లో..	అందించాల్సిన సీఎంఆర్	అందించింది	పెండింగ్
వానాకాలం	91,910	87,762	4.148
యాసంగిలో	52,649	37,093	15,556
2022-23లో..			
వానాకాలం	79,934	23,634	56,068
యాసంగి	56,344	5,959	49,645

నాలుగు సీజన్ల కేటాయింపు ఇలా..

2021–22 వానాకాలం సీజన్‌లో 1,37,180 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. 91,910 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 87,907 మెట్రిక్ టన్నుల బియ్యం అందించారు. 4,148 టన్నులు అందించాల్సి ఉంది. 2021–22 యాసంగిలో 1,01,720 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా 52,642 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 37,093 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇంకా 15,556 అప్పగించాలి. 2022–23 వానాకాలం సీజన్‌లో 1,19,177 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా 79,934 సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు 23,634 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. ఇంకా 56,068 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 56,344 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అప్పగించాల్సి ఉండగా కేవలం 5,959 మెట్రిక్ టన్నులు మాత్రమే అందిచారు. ఇంకా 49,645 మెట్రిక్ టన్నులు అప్పగించాలి.

కదలని గోదాముల్లో నిల్వలు..

ఇదిలా ఉంటే మిల్లులకు కేటాయించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వడంలో తాత్సారం చేస్తుండడంతో గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యం మిల్లులకు గింజ కూడా తరలించడం లేదు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు మిల్లుకు కేటాయించిన ధాన్యంతోపాటు గోదాముల్లో వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. తరుచూ అధికారులు మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి గడువు పెంచుతూ వస్తున్నా టార్గెట్ పూర్తి కావడం లేదు.

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



రమేశ్, కమిషనర్

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు వృద్ధిచెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పారిశుధ్యలోపం, దోమలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నస్పూర్ మున్సిపల్ కమిషనర్ రమేశ్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'సాక్షి' అవకాశం కల్పిస్తోంది.

సాక్షి ఫోన్ ఇన్

మున్సిపాలిటీ : నస్పూర్

సమయం : సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ఫోన్ నంబర్ : 98669 90885

అంశం : పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, దోమల నివారణ చర్యలు.

న్యూస్‌రీల్

వినాయక మండపాల్లో అదనపు కలెక్టర్ పూజలు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మంచిర్యాలఅర్బన్: అదనపు కలెక్టర్ మోతీలాల్ జిల్లా కేంద్రంలోని వినాయక మండపాలను ఆదివారం సందర్శించారు.భగత్‌సింగ్ నగర్‌లో వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో అంజనీపుత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్, డైరెక్టర్లు పిల్లి రవి, భక్తులు పాల్గొన్నారు.

అలరించినకవి సమ్మేళనం



మలయశ్రీని సత్కరిస్తున్న కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కవి, రచయిత మలయశ్రీ రచించిన వందేమాతరం గేయ సంపుటిని సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పరిచయం చేశారు. 92 భక్తి సామాజిక గేయాల వ్యాసాలను అద్భుతమైన సంపుటి అంటూ కవులు శ్రీనాథ్‌గౌడ్ అభివర్ణించారు. మలయశ్రీ రాసిన గేయాలను సభికులు ప్రశంసించారు. ఈసందర్భంగా మలయశ్రీని శాలువాలతో సత్కరించారు. సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్వర్ధన్, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, పలువురు కవులు సగుణాకర్, భూపతి సంతోష్, సత్తయ్య, ప్రమీల, భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరశర్మ కవితాగానం చేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

మంచిర్యాలటౌన్/చెన్నూర్: వైద్య ఆరోగ్య శాఖలోని జీవో 142ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్య శాఖలోని డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్, ప్రభాకర్, కార్యదర్శి నాందేవ్, సభ్యులు డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ శివప్రతాప్, గుండేటి నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, తొగరు ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రజలకు చేటు చేసేలా జీవో ఇచ్చిందన్నారు. అపారమైన అనుభవం ఉన్న ఉద్యోగులు ఉన్నారని, వారి సలహాలు, సూచనలు తీసుకోకుండా జీవో ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం జీవోను రద్దు చేయాలని కోరారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

పాతమంచిర్యాల: అక్టోబర్ 1 భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో సోమవారం చిత్రలేఖనం పోటీ నిర్వహిస్తామని బీఎస్ఎన్ఎల్ మంచిర్యాల సబ్ డివిజనల్ ఇంజినీర్ శ్రీధర్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు స్మార్ట్ లెర్నింగ్ యూజింగ్ భారత్ ఫైబర్ అనే అంశంపై చిత్రలేఖనం పోటీ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అదనపు కార్మికులేరి..?

- వర్షాకాలంలో పారిశుధ్య పనులు ఎక్కువగా చేపట్టాల్సి ఉంటుందని ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు 30 మంది అదనపు కార్మికులను తీసుకున్నారు. రోజుకు రూ.500 చొప్పున నెలకు రూ.4.50 లక్షలు, మూడు నెలలకు గాను రూ.13.50 లక్షలు మున్సిపల్ నిధుల నుంచి చెల్లించేందుకు జూలైలో మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశారు.
- 30 మంది అదనపు కార్మికులు పని చేస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూనే, వారు సరిపోవడం లేదని ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు గాను మరో 20 మందిని అదనంగా తీసుకుంటున్నట్లు ఆగస్టులో మున్సిపల్ సమావేశంలో తీర్మానించారు. 20 మందికి నెలకు రూ.3 లక్షల చొప్పున రెండు నెలలకు రూ.6 లక్షలు కేటాయించారు. అంటే 50 మందిని అదనంగా తీసుకుని రూ.19.50 లక్షలు చెల్లిస్తున్నారు. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో కార్మికులు పని చేస్తే ఎక్కడా చెత్త ఉండదు. అయినా ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఈ 50 మందిని లెక్కల్లోనే చూపించి వేతనాలు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



డీఎఫ్‌వో కార్యాలయం వెనకాల రోడ్డుపై వేసిన చెత్తా చెదారం

- మంచిర్యాల బల్దియాలో పేరుకు పోతున్న చెత్త
- 303 మంది కార్మికులు ఉండగా, అదనంగా 50 మంది
- అయినా ఎక్కడి చెత్త అక్కడే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో జనాభాకు సరిపడా కార్మికుల కంటే 60 మంది అదనంగా ఉన్నారు. ప్రస్తుతం 303 మంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గత జిల్లా కలెక్టర్ అవసరానికి మించి పారిశుధ్య కార్మికులు ఉన్నారని, కొత్త వారిని నియమించేందుకు అనుమతులు లేవని తేల్చారు. ప్రస్తుతం ఉన్న 303 మందిలో అధికార పార్టీకి చెందిన కొందరిని కాంట్రాక్టు కార్మికులుగా తీసుకోగా, లెక్కల్లో మాత్రమే వారు కనిపిస్తున్నారు. పనులు చేయకుండా వేతనాలు తీసుకునే వారు దాదాపుగా 20కి పైగానే ఉన్నారు. వీరితోపాటు యూనియన్ పేరిట తిరిగే మరికొందరు కార్మికులు పారిశుధ్య పనులకు ఆసక్తి చూపించక పోగా, విధుల్లో మాత్రం ఉంటున్నారు. చెత్తను తరలించేందుకు ఏర్పాటు చేసిన 15 ట్రాక్టర్లు, 46 ఆటోలు నడిపేందుకు డ్రైవర్ల నియామకం చేపట్టలేదు. దీంతో ఉన్న కార్మికుల నుంచే డ్రైవింగ్ వచ్చిన వారిని ఆయా వాహనాలను నడిపేందుకు కేటాయించారు. 60 మంది డ్రైవర్లుగా వెళ్లినా, ఇంకా 243 మంది పనిచేయాల్సి ఉంది. వీరు కాకుండా, అదనంగా తీసుకున్న 50 మందిని కలిపితే వీరి సంఖ్య 293. పట్టణంలో 36 వార్డులు ఉంటే వార్డుకు 8 మంది కార్మికులను కేటాయించేందుకు వీలుంది. అదనంగా తీసుకున్న కార్మికులు వార్డుల్లో పనులు చేస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదని కౌన్సిలర్లే చెబుతున్నారు. జనాభాకు మించి కార్మికులు ఉన్నా పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే అన్నచందంగా మారింది. ప్రతీ నెల లక్షలాది రూపాయలను కార్మికులకు వేతనాల రూపంలో అందిస్తున్నా చెత్తరహితంగా ఉంచడంలో అధికారులు విఫలం చెందుతున్నారు.



బెల్లంపల్లి చౌరస్తాలో రోడ్డు పక్కన చెత్త..

వ్యాధులకు ఆవాసాలుగా..

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతుండగా, కొందరు డెంగీ బారిన పడుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోకపోయినా, ఎప్పటి చెత్త అప్పుడే తరలించేలా పాలకవర్గం వ్యవహరించకపోవడంతో ప్రజలు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో పోస్తుండగా, ఆ యార్డు పూర్తిగా నిండిపోయింది. దీంతో కొన్ని వార్డుల్లోని చెత్తను సైతం రోజుల తరబడి తీయకుండా అలాగే ఉంచుతుండడం కూడా వ్యాధులు ప్రబలేందుకు కారణం అవుతోంది.

'బెల్లంపల్లి బరిలో ఉంటాం'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శంకర్



మాట్లాడుతున్న కలవేణి శంకర్

బెల్లంపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి సీపీఐ పోటీ చేయడం కాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ తెలిపారు. బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా శంకర్ హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో, కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గంలో సీపీఐ పోటీ చేసి నాలుగు సార్లు విజయం సాధించిందని గుర్తు చేశారు. ఈసారి జరిగే ఎన్నికల్లోనూ తమపార్టీ పోటీ చేయాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ప్రజాపోరాటాలతో పార్టీ నిర్మాణం పటిష్టం చేసుకుని ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లోనూ సీపీఐ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమని పేర్కొన్నారు. పొత్తుల ద్వారా బెల్లంపల్లి సీటును సీపీఐ కోరుతోందని తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ స్నేహబంధం పేరుతో మిత్రద్రోహం చేసిందని విమర్శించారు. అమర వీరుల ఆకాంక్షలను బీఆర్ఎస్ మట్టిలో కలిపేసిందని మండిపడ్డారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం సాగిస్తుందన్నారు. బెల్లంపల్లిలో సీపీఐని గెలిపించడానికి ప్రజలు, కామ్రేడ్స్ సమరోత్సాహంతో పని చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, మామిడాల రాజేశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే జీవకోటి మనుగడ

- సింగరేణి డైరెక్టర్ బలరాం
- ఒకేరోజు 550 మొక్కలు నాటిన డైరెక్టర్



శ్రీరాంపూర్ ఓసీపీపై మొక్క నాటుతున్న బలరాం

శ్రీరాంపూర్: పచ్చదనంపైనే జీవకోటి మనుగడ ఆధారపడి ఉందని సింగరేణి డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎస్.బలరాం అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై ఆదివారం ఒక్కరోజే 550 మొక్కలు నాటారు. దీంతో ఇప్పటి వరకు ఆయన కంపెనీ వ్యాప్తంగా నాటిన మొక్కల సంఖ్య 17,690 చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా పచ్చని వనాలను పెంచుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. భావితరాలు స్వచ్ఛమైన గాలి, పర్యావరణాన్ని పొందాలంటే మనం నాటిన మొక్కలే ఆధారంగా ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సీఎండీ శ్రీధర్ మార్గదర్శకత్వంలో సింగరేణి సంస్థ అనేక ప్రాంతాల్లో విరివిరిగా హరితహారం చేపట్టిందని తెలిపారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో వృక్ష ప్రేమికుడైన డైరెక్టర్ బలరాం ఇక్కడ మొక్కలు నాటిన ప్రాంతానికి ఉమెన్స్ మినీ ఫారెస్ట్‌గా నామకరణం చేశామన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారుల సంఘం నాయకులు ఏవీ.రెడ్డి, అబ్దుల్ ఖాదిర్, ఏరియా ఎస్‌వోటు జీఎం రఘుకుమార్, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్ రాముడు, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, గని మేనేజర్ సుధీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమ అధికారి బొంగుని శంకర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

డిస్పెన్సరీని సందర్శించిన డైరెక్టర్..

సింగరేణి డైరెక్టర్ బలరాం ఆర్కే–8 డిస్పెన్సరీని సందర్శించారు. ఫిజియోథెరపీ వార్డు, ఇతర వార్డులను పరిశీలించారు. ఏర్పాట్లు, చికిత్స గురించి వైద్యాధికారులు డైరెక్టర్‌కు వివరించారు. ఉద్యోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన వెంట శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్, శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటూ జీఎం రఘుకుమార్, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు అల్పాహారం

- ఒకటి నుంచి పదో తరగతి వరకు అమలు..
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో మేలు..



మంచిర్యాలఅర్బన్: సర్కారు బడిలో చదివే విద్యార్థులకు ఇక నుంచి అల్పాహారం అందించనున్నారు. అక్టోబర్ 24(దసరా) నుంచి అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ జీవో జారీ చేశారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం(సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం)తో విద్యార్థులకు ఊరట కలిగించింది. ఇదివరకు జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహణ సందర్భంగా స్నాక్స్ అందించారు. ప్రస్తుతం ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రతీరోజు ఉదయం అల్పాహారం అందించాలని నిర్ణయించారు. సర్కారు బడిలో చదివే విద్యార్థులు పేదవారే కావడంతో ఇంటి నుంచి అర్ధాకలితో బడికి వస్తుంటారు. ఆకలితో పాఠశాలలో చెప్పే పాఠాలు అర్థం కాని పరిస్థితి. ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థులకు మేలు జరగనుంది.

మార్గదర్శకాలు వస్తేనే..

అల్పాహారం అమలుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అల్పాహారంగా ఏమేమి ఇస్తారో ఇప్పుడే తెలియదని అధికారులు చెబుతున్నారు. తమిళనాడులో పొంగల్, సాంబారుతో కలిపి రవ్వ ఉప్మా సేమియా ఉప్మా, రవ్వ కిచిడీ, సేమియా కిచిడీ అందిస్తున్నారు. అక్టోబర్ 24 నుంచి అమలు చేసే సీఎం బ్రేక్‌ఫాస్ట్‌లో ఏమేమి ఇస్తారనే విషయంపై ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఇప్పటికే రోజువిడిచి రోజు అన్ని పాఠశాలల్లో అన్నపూర్ణ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో రాగిజావా పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులే తయారు చేసి ఇస్తున్నారు. అల్పాహారం కూడా మధ్యాహ్న భోజన ఏజెన్సీలు అందిస్తే వారికి నిధులు పెంచాల్సి ఉంటుంది. ఇప్పటికే రాగిజావా తయారీకి ఏమీ ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. అల్పాహారం అంటే వంటగ్యాస్ నుంచి పెరిగిన నిత్యావసర సరుకుల వరకు తడిసి మోపెడవుతాయని వంట కార్మికులు పేర్కొంటున్నారు.

బడ్జెట్ మంజూరైనా..

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలల నుంచి నాలుగు నెలల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. బడ్జెట్ మంజూరైనా ఇ–కుబేర్‌లో రోజుల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. ఈ ఏడాది జూలై 3న మధ్యాహ్న భోజనం నిధులు మంజూరయ్యాయి. 1 నుంచి 8 వతరగతి వరకు కుకింగ్ కాస్ట్ చెల్లింపునకు బడ్జెట్ రిలీజ్ చేశారు.

పూర్తి నిధులు విడుదల..

మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఈనెల 22న విడుదల చేసింది. తొమ్మిది నెలలకు సంబంధించి నెలకు రూ.2 వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి. రూ.2,30,58,000 వేలు జిల్లాకు మంజూరయ్యాయి. గత జూన్‌లో రూ.వెయ్యి చొప్పున విడుదల కాగా, తాజాగా రూ.2 వేల చొప్పున మంజూరయ్యాయి. 1 నుంచి 8వ తరగతి ఎగ్‌కాస్ట్ నిధులు రూ.36,62,900 విడుదలయ్యాయి. 9, 10వ తరగతికి సంబంధించి కుకింగ్ కాస్ట్ బడ్జెట్ రూ. 56,86,000 విడుదలయ్యాయని డీఈవో యాదయ్య తెలిపారు.

రేపు ఐలమ్మ జయంతి

చెన్నూర్: ఈ నెల 26న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా వీరనారి చాకలి ఐలమ్మ 128వ జయంతి నిర్వహిస్తుందని ఉత్సవ కమిటీ కోకన్వీనర్లు పెద్దపూరం కుమారస్వామి, రమేశ్, నిమ్మల మధు తెలిపారు. జయంతి ఉత్సవాలకు జిల్లాలోని రజకులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

శాకాంబరుడిగా గణనాథుడు





విశ్వనాథ కాలక్షేప మండపంలో శాకాంబరుని అలంకరణలో గణనాథుడు

మంచిర్యాలఅర్బన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం మండపాల్లో వినాయకుడిని వివిధ రూపాల్లో అలంకరించారు. మంచిర్యాల విశ్వనాథస్వామి కాలక్షేప మండపంలో గణనాథుడిని కూరగాయలతో అలంకరించారు. శాకాంబర స్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించారు.

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇంటిగోడ



కూలిన గోడ వద్ద బాధితుడు

భీమిని: ఆదివారం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని కుర్మిళ్ల భీమయ్యకు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

గాంధీభవన్‌లో బీసీ నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నీలకంఠేశ్వర్

మంచిర్యాలటౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకు టికెట్ల కేటాయింపుపై ఓబీసీలు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చర్చలు జరిపారు. సమావేశానికి 88 నియోజకవర్గాల నుంచి ఓబీసీలు హాజరుకాగా మంచిర్యాల నుంచి డాక్టర్ నీల కంఠేశ్వర్ పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం రాష్ట్రంలో 34 సీట్లను బీసీలకు కేటాయించాలని నిర్ణయించగా 44 కేటాయించాలని డిమాండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక

తాండూర్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సురభి గార్డెన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ బాలబాలికల ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్–14 బాలుర విభాగంలో మయూర్, కౌవల్యరామ్, నిహాల్, సూర్యతేజ్, విశ్వసృజన్, బృహన్‌రుషి, బాలికల విభాగంలో శ్రీహర్షిణి, మేఘన, సిద్సాయి, సాన్విక, అక్షయ, అండర్–17 బాలుర విభాగంలో హర్షవర్ధన్‌రెడ్డి, విశ్వతేజ, గోపి, అనుదీప్ ఉండగా, బాలికల విభాగంలో మల్లేశ్వరి, జయ రాజహంస, హారిని, నిహారిక, అనూష ప్రతిభ కనబర్చారు. అక్టోబర్ మొదటివారంలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ పరిమళ తెలిపారు.

మథుర సంస్కృతి.. విభిన్నం

- వేష, భాషలో ప్రత్యేకత
- ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన తెగ
- అకాడ, తీజ్, జోహారా ప్రత్యేక పండుగలు

బజార్‌హత్నూర్(బోథ్): చెమటచుక్క లెక్కచేయని శ్రామికులు.. అందం, అమాయకత్వం కలగలిసిన పశు ప్రేమికులు.. అడవిని జయించగల పూరేకులు.. భూమిని చుట్టేయగల ప్రకృతి ప్రేమికులు.. నాగరిక సమాజానికి కాస్త దగ్గరగా ఉన్న సంచార సమూహమే మథుర తెగ. ఇందులో 11 గోత్రాల వారున్నారు. వీరిలో ఉమ్మడి కుటుంబాలే అధికం. ఈ తెగకు పెద్ద నాయక్. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మాత్రమే ఈ తెగ కనబడుతుంది.



జోహారా కార్యక్రమంలో భాగంగా పుట్టమన్ను తెస్తున్న మహిళలు (ఫైల్)



ఆభరణాలు ధరించిన మహిళ (ఫైల్)



పాచికలు ఆడుతున్న పురుషులు (ఫైల్)

ఆచార సంప్రదాయాలు

ఈ సంచార తెగ ఒకప్పుడు ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన సంచారజీవులు. ప్రస్తుతం అటవీప్రాంతాల సమీపంలో, కొండలు, వాగుల వద్ద స్థిరపడ్డారు. ప్రధానంగా పశు కాపరులు. వీరి ఆర్థికస్థితిని పశువుల సంఖ్యతోనే లెక్కగడుతారు. దశాబ్దాల క్రితం గోవులను మేపుకుంటూ నెలల తరబడి ఇంటికి దూరంగా వెళ్లేవారు. మొదట్లో పోడు వ్యవసాయం చేసేవారు. ప్రస్తుతం పశుసంపదతో పాటు వ్యవసాయం చేస్తున్నారు. ఆచార సంప్రదాయాల్లోనే కాదు వేషభాషల్లోనూ ఈ తెగ ప్రత్యేకమే. ఎంతో విశిష్టత సంతరించుకున్న మథుర తెగను కయితి లబానా, మథుర లబానా, మురికి లబానా అని పిలుస్తారు. 1708లో ఉత్తర భారతదేశంలోని పంజాబ్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి ఈ తెగ వలస వచ్చినట్లు ప్రతీతి.

పండుగలకు ప్రత్యేక స్థానం

మారెమ్మ, మావలి, అకాడి, నాగులపంచమి, జోహారా, రాఖీ, దసరా పండుగలు వారి జీవితాల్లో ప్రధానమైనవి. కృష్ణున్ని అమితంగా పూజిస్తారు. హోలీని మూడురోజుల పాటు జరుపుకుంటారు. దూల్, దూలండి, పాయిబీచ్..ఇలా రోజుకో కార్యక్రమం జరుగుతుంది.

ఆడపిల్లల ప్రత్యేక పండుగ జోహారా

పాముల పుట్ట (చీమల పుట్ట) నుంచి తెచ్చిన బంక మట్టిలో గోధుమ గింజలు, శనగ గింజలు పోయగా మొలకెత్తిన వాటినే జోహారా అంటారు. నాగుల పంచమి తర్వాత మూడు రోజులకు ఈ పండుగ ఉంటుంది. ఈ నారుకు పెళ్లికానివారు 8 రోజుల పాటు బావి నుంచి నీరు తెచ్చి పోస్తారు. ఇలా ఎనిమిదో రోజు రాత్రి పూట కన్నయ్య(బంక మట్టి ముద్ద)కు పూజిస్తారు.

మహిళలది ప్రత్యేక స్థానం

వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. ఇందులో సింహభాగం పనులు మహిళలే చేస్తారు. వీరికి ఆభరణాలంటే అమితాసక్తి. ఊడిపోయిన తల వెంట్రుకలను పోగు చేసుకుని నిలువుగా కుట్టిన గుడ్డలో వాటిని ఉంచి చుండాను తయారు చేస్తారు. తలపై నుంచి చుండా పడిపోకుండా బ్యాలెన్స్ చేసే దోరాను కట్టుకుంటారు. నుదిటిపై టిక్కి, ముక్కుకు ఉండే నథోలి, మెడలో ఉండే ఆభరణంలో రాకిడి, నమోలి, కపోర్, పావుల, ఘూటి, చెవులకు ఘూటి, బీటకేట్, చేతి గాజుల్లా కనిపించే ఘోట్, మొగర్, మోచేతులపైకి ఉండే అలియా, గజార, దోరా, కాళ్లకు చూడా, లాక్, ఖీడ్, నడుముకు కాచులి, గాగ్రా, కాలి వేళ్లకి బిచ్కా, చట్కి, గుట్టి వంటి ఆభరణాలు ధరిస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలు లెహంగా, కల్లీ దుస్తులు ధరిస్తారు. పురుషులకు ఆహార్యంలో పాగడి, పరికి, పలోపేటి, దండా డోక, డోనియా, జగ్గ, దోతి, కంగ్రి రుమాల్, పంచ ప్రధానంగా కనిపిస్తాయి.

సంప్రదాయక ఆహారం

గోధుమ రోటి, శనగ, పెసర, మొక్కజొన్నలకు సంబంధించిన ఆహారం, పాలు, పెరుగు, వెన్న, ఆవు నెయ్యి, టీ, బెల్లం, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకుంటారు. పండుగల సమయంలో మాల్‌పూవ, సిరా, గేహార్, పూరి, మలిద, లాబ్సీ వంటి పిండి వంటకాలతో పాటు పల్లి, కందగడ్డలతో పాయసం చేసుకుంటారు. వంటలకు కట్టెల పొయ్యినే వాడుతారు. అప్పట్లో పొయ్యిలో నిప్పు ఉన్నప్పుడు అన్నం తినేవారు. ఒకవేళ నిప్పు ఆరిపోతే అన్నం తినేవారు కాదు. కొందరు ప్రభుత్వం ఇచ్చిన పక్కా ఇళ్లు కట్టుకున్నా మిగతావారు ఇప్పటికీ గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. అడవుల్లోని కలప దుంగలతో ఇళ్లు కట్టుకుంటారు. పైకప్పుగా టీన్స్, వరిగడ్డిని వాడుతారు.



కన్నయ్యను పూజిస్తున్న యువతులు (ఫైల్)

తీజ్ కూడా ప్రత్యేకమే

బంజారాల మాదిరిగా మథుర లబానా తెగవారు తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. రాఖీపౌర్ణమి తర్వాత మూడు రోజులకు వచ్చే తీజ్‌ను పెళ్లి కాని ఆడపిల్లలు జరుపుకుంటారు. 21 రకాల పూలు, బంకమట్టితో కన్నయ్యను తయారు చేసి దేవుడిలా అలంకరించి పూజిస్తారు. రాత్రి పూట నిమజ్జనం చేస్తారు.

నగార (డోలు) వాయిద్యం

ఈ తెగ వారు ప్రతీ పండుగ, కార్యక్రమంలో ఉపయోగించే వాయిద్యం నగార. దున్నపోతు చర్మంతో చేసిన నగార వారి అన్ని కార్యక్రమాలలో కీలకమైంది. వీరి ప్రధాన ఆటవిడుపు కార్యక్రమం చోప్డా(పాచికలు). ఆయా పండుగల్లో మహిళలు నృత్యం చేస్తూ పాటలు పాడుతూ ఉంటే పెద్దలు ఒకచోట కూర్చుని పాచికలు ఆడుతూ సేదతీరుతారు.

పండుగలంటే అభిమానం



మా మథుర సమాజంలోని మహిళలకు ఆభరణాలు, పండుగలంటే ప్రత్యేక అభిమానం. అకాడ, జోహారా, తీజ్ పండుగలు నియమ నిష్టలతో చేస్తాం. నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి పూజలు చేస్తాం. పెళ్ళికాని ఆడపిల్లలు జోహారా, తీజ్ పండగలను జరుపుకుంటారు. మహిళల ప్రత్యేక ఆకర్షణగా చుండా ఉండేది. కానీ ప్రస్తుతం యువతులు చుండాను ధరించడానికి ఇబ్బంది పడుతున్నారు.

– అజాడే జయశ్రీ, ఎంపీపీ, బజార్‌హత్నూర్

పశుసంపదే మా కులవృత్తి



మథుర లబానా కులస్తుల కులవృత్తి పశుసంపద. గతంలో నెలల తరబడి పశువులను మేపుకుంటూ గ్రాసం ఉన్న దూరప్రాంతాలకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం సాగునీటి సౌకర్యాలు ఏర్పడటంతో వ్యవసాయంతో పాటు పశువులు కాస్తున్నాం. మా కులంలో ఇప్పటికీ కట్నకానుకల సమస్య లేదు. మా ఆచార సంప్రదాయాలు ఇలాగే కొనసాగిస్తాం.

– దరుసింగ్‌నాయక్, మంజరంతండా

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల దృష్ట్యా సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన ఒప్పందంలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి వల్లే కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం జరిగిందన్నారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ వైఫల్యాలను కార్మికుల సమక్షంలో ఎండగట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆర్కే 6 గనికి చెందిన ఆసంపల్లి రాయలింగు అనే కార్మికుడు యూనియన్‌లో చేరాడు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు కాదాసి భీమయ్య, ఏరియా జాయింట్ సెక్రెటరీ పీ.వినోద్ కుమార్, నాయకులు రామకృష్ణ, రాకేష్, చంద్రశేఖర్, గోపతి సందీప్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



కండువాకప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

గంజాయి గుట్టు రట్టు..!

- ట్రాక్టర్ బోల్తా పడడంతో వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిల్వలు

శ్రీరాంపూర్: ట్రాక్టర్ బోల్తా పడడంతో గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలోని రహదారిపై జైపూర్–ఇందారం చౌరస్తా నుంచి శ్రీరాంపూర్ వైపునకు ఫ్లైయాస్ ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. శనివారం శ్రీరాంపూర్ పోలీసుల దృష్టికి రావడంతో ఘటనాస్థలిని సందర్శించారు. ట్రాక్టర్ వద్ద డ్రైవర్ లేకపోవడం, నంబర్ ప్లేట్ కూడా లేకపోవడంతో జేసీబీని పిలిపించి ట్రాక్టర్‌ను తీసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇటుకల అడుగున గంజాయి సంచులు గుర్తించారు. సుమారు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ట్రాక్టర్‌ను, అందులోని సరుకును స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్‌ను సంప్రదించగా పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా ఇంత పెద్దమొత్తంలో గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందనేది చర్చనీయాంశంగా మారింది. ఇది చెన్నూరు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు ట్రాక్టర్ బాడి, ఇంజన్ నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ నంబర్ తెలుసుకుని దాని ఆధారంగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

రెవెన్యూలో అవినీతి చేపలు!

- ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు అధికారులు
- పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణకు డబ్బులు డిమాండ్
- రూ.2లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన వైనం
- మావల తహసీల్దార్, ఆర్‌ఐ రిమాండ్‌కు తరలింపు



మావల తహసీల్దార్ కార్యాలయం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

ఆదిలాబాద్‌రూరల్: రెవెన్యూ శాఖలో ఇద్దరు అవినీతి అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం ఓ రైతును కొంత కాలంగా తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ పని చేసేందుకు డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందం కుదుర్చుకున్న డబ్బులను అధికారులకు ముట్టజెబుతున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారని తెలియడంతో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు కార్యాలయానికి చేరుకున్నారు. ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు గుమిగూడారు.

అసలేం జరిగిందంటే..

నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్‌తో పాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నం.181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని అగ్రిమెంట్ రిప్రజెంటర్ యతేంద్రనాథ్ యాదవ్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివరాలు.. సుధాకర్‌కు సంబంధించిన భూమిలో ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలకు సంబంధించి పట్టాలు ఉన్నాయి. ఈ పట్టేదారైన సుధాకర్ వృద్ధుడు కావడంతో దీనికి సంబంధించిన వ్యవహారాలు చూసుకునేందుకు తనకు అప్పగించాడు. అయితే పట్టాపాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023 ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కూడా ఈ పనుల విషయంలో జాప్యం చేశారు. ఆ తహసీల్దార్ బదిలీపై వెళ్లే సమయంలో కలెక్టర్ కార్యాలయానికి ఫైల్ పంపించారు. కలెక్టరేట్ నుంచి ఆగస్టు 11న మావల తహసీల్దార్ కార్యాలయానికి రీవెరిఫికేషన్ కోసం ఫైల్ వచ్చింది. ఈ ఫైల్ కదలకుండా అలాగే ఉంది. ఈ విషయంపై తహసీల్దార్‌ను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించగా స్పందించలేదు. మధ్యవర్తిగా ఆర్‌ఐ హన్మంత్‌రావు రూ.20లక్షలు డిమాండ్ చేశా డు. తమవద్ద అంత మొత్తంలో డబ్బులు లేవని తెలుపడంతో మొదట రూ.2లక్షలు ఇవ్వాలని డీల్ చేశాడు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కొన్ని డబ్బులు చెల్లించాలని పేర్కొన్నాడు. దీంతో వారు ఒప్పుకున్నారు. మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐలు డబ్బులు డిమాండ్ చేశారు. ఆదివారం మావ ల తహసీల్దార్ కార్యాలయానికి డబ్బులు తీసుకురావాలని తెలిపారు. దీంతో ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులను యతేంద్రనాథ్ యాదవ్ ఈనెల 21న ఆశ్రయించాడు. ఒప్పందం మేరకు యతేంద్రనాథ్ ఆయన సోదరుడితో కలిసి ఆదివారం ఉదయం 11.15 గంటల ప్రాంతంలో డబ్బులు తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. రెవెన్యూ అధికారులకు ముట్టజెబు తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి మొబైల్ ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నారు.

అవినీతి అధికారుల రిమాండ్..

పట్టుబడిన తహసీల్దార్, ఆర్‌ఐలను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సాయంత్రం వరకు ఇద్దరు అధికారులను విచారించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐ హన్మంత్‌రావు పనులు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామన్నారు. పనుల కోసం అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని పేర్కొన్నారు.

ఏడు నెలల వ్యవధిలో రెండో ఘటన..

జిల్లాలో అవినీతి అధికారులు ఇటీవల తెరపైకి వస్తున్నారు. ఆయా పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొంత మంది తమ పనుల కోసం డబ్బులు ముట్టజెబుతుండగా గత్యంతరం లేక మరికొంత మంది ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులతో పాటు రిమ్స్‌లో పనిచేసే మరో జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు ఏసీబీకి పట్టుబడడంతో అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది.

మహా సమ్మేళనానికే గ్రౌండ్ కేటాయింపు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌ఎట్టకేలకూ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం కోసమే కేటాయించడానికి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మొగ్గు చూపారు. అక్టోబర్ 1న మహా సమ్మేళనం కోసం గ్రౌండ్ కేటాయించాలని పూర్వ విద్యార్థులు సింగరేణి యాజమాన్యానికి దరఖాస్తు చేసుకోవడంతో అనుమతి లభించింది. కానీ మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రోగ్రాం కూడా అదేరోజు ఉండడంతో సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారని పూర్వ విద్యార్థులు ఆవేదన చెందారు. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కలిసి మంత్రి కేటీఆర్ ప్రోగ్రాం మరోచోట నిర్వహించేలా చూడాలని అభ్యర్థించారు. వారి బాధను అర్థం చేసుకున్న సుమన్ మంత్రి ప్రోగ్రాంను మరోచోట నిర్వహించేందుకు ఒప్పుకున్నారు. అంతేకాకుండా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పూర్తి సహకారం అందిస్తానని, రెండు కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

దొరగారిపల్లెలో ‘మేరామిట్టి, మేరాదేశ్’

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని దొరగారి పల్లె నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అమరులైన వీర జవాన్లు, పోలీసుల కోసం నూతనంగా నిర్మిస్తున్న స్మృతి వనం కోసం దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించాలని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు బోయిని హరికృష్ణ, పాలవేని మహేశ్, బల్ల రవి, బండి మల్లికార్జున్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



దొరగారిపల్లెలో మట్టిని సేకరిస్తున్న రఘునాథ్

ప్రకృతి కనువిందు..



దండేపల్లి మండలంలోని కొత్తమామిడిపల్లిలో ఆదివారం తెల్లవారుజామున మేఘాలు గుట్టలను తాకుతూ కనువిందు చేశాయి. ఆ అందాలకు నేలపై పచ్చని పంటలు మరింత తోడయ్యాయి. ఆ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికుల మనస్సుకు కనువిందు కలిగించింది.

– దండేపల్లి(మంచిర్యాల)